Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 314
పేజీలు : 3
బుధవారం 17.06.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## నీట్ రీ-ఎగ్జామ్- పేపర్ లీక్ పుకార్లను నమ్మవద్దు

**ఎన్‌టీఏ సూచన**



**టీ మీడియా,జూన్16, ఢిల్లీ బ్యూరో :** నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్?కు సమయం దగ్గరపడుతున్న తరుణంలో నేషనల్? టెస్టింగ్? ఏజెన్సీ(ఎన్?టీఏ) అలర్ట్ జారీ చేసింది. ప్రశ్నా పత్రాల లీకేజీ వదంతులను నమ్మవద్దని విద్యార్థులను సూచించింది. అలాగే, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే ఫిర్యాదు చేయాలని అభ్యర్థులను, వారి తల్లిదండ్రులను కోరింది. నకిలీ వెబ్‌సైట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.అలాగే, మోసపూరిత ప్రచారాలకు అడ్డుకట్ట వేయడానికి ఎన్?టీఏ ఒక ప్రత్యేకమైన ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఎవరైనా ఎగ్జామ్? ప్రశ్నాపత్రాలు ఇస్తామని డబ్బులు అడిగినా, లేదా లీక్ అయిందని తప్పుడు ప్రచారం చేసినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొంది. అటువంటి మోసగాళ్లపై సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్?టీఏ హెచ్చరించింది.

# సన్నవడ్ల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలి



- సీఎం రేవంత్ రెడ్డి
- వ్యవసాయ శాఖపై సమీక్ష

**టీ మీడియా,జూన్16, హైదరాబాద్ బ్యూరో :** విత్తనాల సరఫరా నుంచి పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో నిర్దిష్ట కార్యచరణ అమలు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వచ్చే వ్యవసాయ సీజన్ సాఫీగా జరిగేలా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. బోనస్ వచ్చే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారానే బుక్ చేసే విధానం తీసుకురావాలని అన్నారు. రామగుండం కర్మాగారంలో ఉత్పత్తయ్యే ఎరువులు అత్యధికంగా తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి, ఎరువులపై వాస్తవ పరిస్థితిని వివరించాలని సీఎం తెలిపారు.

### రైతుల వివరాల నమోదు

రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని సీఎం ఆదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్?లో రానున్న వ్యవసాయ సీజన్‌పై సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సూచనలను సమీక్షించారు. వచ్చే సీజన్ కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని అదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, పౌరసరఫరాల శాఖ ఎండీ, ప్రణాళిక శాఖ కార్యదర్శి సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు.



### అందుబాటులో 7 రకాల సన్న వడ్ల విత్తనాలు

కనీస మద్దతు ధరలు కేంద్రం నిర్దేశించిన కోటాకు అనుగుణంగా రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో సబ్సిడీ రేట్లతో అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు.

సాంకేతిక పరిజ్ఞానం అనుసంధానం : వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని చెప్పారు.

### రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ

ఎరువుల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు అన్ని రకాల ఫెర్టిలైజర్లను యాప్ ద్వారా బుక్ చేసే విధానం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీ బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్?కు అవసరమైన యూరియా కేటాయింపులపై ఎప్పటికప్పుడు కేంద్రానికి లేఖలు రాయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు. రైతు వేదికలను పూర్తిగా రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

### ప్రభుత్వ డైరీ మరింత బలోపేతం

గతంలో రూ.13 వేలకు టన్ను అమ్మిన పరిస్థితి ఉందని ఈసారి దాదాపు రూ.21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చిందని చెప్పారు. ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభాల దిశలో నడిపించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ డైరీని మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. సకాలంలో పాల రైతులకు చెల్లింపులు జరపాలని సూచించారు.

# 'దేశమే ఫస్ట్.. మిగతావన్నీ నెక్స్ట్'..

## ఢిల్లీ వేదికగా ప్రకటించిన పవన్ కల్యాణ్



**టీ మీడియా,జూన్16, ఢిల్లీ బ్యూరో :**

జనసేన పార్టీకి దేశ సమగ్రత, జాతీయ సమైక్యతే అత్యున్నత ప్రాధాన్యమని ఆ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. "దేశమే ఫస్ట్.. మిగతావన్నీ నెక్స్ట్" అనేది ఇకపై జనసేన పార్టీ విధానం మాత్రమే కాకుండా అధికారిక నినాదంగా కూడా కొనసాగుతుందని ప్రకటించారు. దేశ విభజన భావజాలం, ప్రాంతీయ విద్వేషాలు, ప్రజల మధ్య చిచ్చు పెట్టే శక్తులపై జనసేన రాజీలేని పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు.దేశ రాజధాని ఢిల్లీలోని అశోక హోటల్‌లో నిర్వహించిన "జాతీయ సమైక్యత కోసం.. సేన ప్రస్థానం" సమావేశంలో పవన్ కల్యాణ్ కీలక ప్రసంగం చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, అలాగే తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.2014లో జనసేన పార్టీని స్థాపించినప్పుడు అధికారం లేదా పదవుల కోసం కాదని, దేశ ప్రయోజనాలు, జాతీయ సమైక్యత కోసం పార్టీని ప్రారంభించామని పవన్ గుర్తు చేశారు. దేశాన్ని బలోపేతం చేయడం, ప్రజల్లో జాతీయ చైతన్యం పెంపొందించడం, సమగ్రతను కాపాడటం పార్టీ ప్రధాన లక్ష్యాలని చెప్పారు. 12 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు, పరాజయాలు ఎదురైనా, నేడు లక్షలాది మంది కార్యకర్తలతో బలమైన రాజకీయ శక్తిగా ఎదిగామని పేర్కొన్నారు.దేశ సమైక్యత కోసం ఢిల్లీ వేదికను ఎంచుకోవడంపై కూడా పవన్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఢిల్లీ భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ వ్యవస్థకు, త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు. దేశాన్ని ఏకం చేయడంలో తొలి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ పాత్రను గుర్తు చేస్తూ, దేశ సమగ్రతను కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని అన్నారు. అదే ఆలోచనతో జనసేన ముందుకు సాగుతోందని చెప్పారు.తెలంగాణ అంశాన్ని ప్రస్తావిస్తూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తాము ఎప్పుడూ వ్యతిరేకించలేదని, అయితే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర విభజనను నిర్వహించిన తీరును మాత్రమే విమర్శించామని స్పష్టం చేశారు. సరైన విధానంలో విభజన జరగకపోవడం వల్లే ఇప్పటికీ ఆస్తుల పంపకం, విభజన సమస్యలు కొనసాగుతున్నాయని అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాలకు భంగం కలిగించే శక్తులను జనసేన ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని పవన్ హెచ్చరించారు. దేశ సమగ్రతకు హాని చేసే చర్యలు, విభజనవాద రాజకీయాలను బలంగా ఎదుర్కొంటామని తెలిపారు. అధికార రాజకీయాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.అలాగే జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు పవన్ కల్యాణ్ కీలక సూచనలు చేశారు. కేవలం తమ నియోజకవర్గాల సమస్యలకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ అంశాలపై పార్లమెంట్‌లో గళమెత్తాలని సూచించారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ సమగ్రత, రాజ్యాంగ విలువలు, జాతీయ ప్రయోజనాల కోసం జనసేన ఎంపీలు పోరాడాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు దేశభక్తి, రాజ్యాంగ విలువలు, బాధ్యతాయుత రాజకీయాలపై అవగాహన కల్పించడం కూడా జనసేన లక్ష్యమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. దేశం బలపడితేనే రాష్ట్రాలు బలపడతాయని, అందుకే దేశమే తమ తొలి ప్రాధాన్యమని మరోసారి స్పష్టం చేశారు.

## ఆక్వాఫీడ్ ధరలు

# తగ్గించాల్సిందే..

## చంద్రబాబు సర్కార్‌కు వైఎస్ జగన్ అల్టిమేటం



**టీ మీడియా,జూన్16, అమరావతి బ్యూరో :**

ఆక్వాఫీడ్ ధరలు తగ్గించాల్సిందేనని లేదంటే ఆక్వా రైతులతో కలిసి ఉద్యమిస్తామని ఏపీలోని కూటమి ప్రభుత్వానికి మాజీ సీఎం వైఎస్ జగన్ హెచ్చరించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయంలో జగన్‌తో ఆక్వా రైతులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ..వైసీపీ హయాంలో ఆక్వా రైతుల కోసం ఎంతో కృషి చేశామన్నారు.కానీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నేడు రైతులు ఏపీలో దర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఆక్వాఫీడ్ ధరల్ని ఈ నెలాఖరులోగా తగ్గించాలని, లేదంటే రైతుల తరఫున పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులకు వైసీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.




# డిప్యూటీ డైరెక్టర్ నివాసంలో ఏసీబీ సోదాలు

- బెడ్ కింద భారీగా నోట్ల కట్టలు





**టీ మీడియా,జూన్16, హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తిమింగలాలపై ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా లాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న పక్కా సమాచారంతో చేపట్టిన సోదాల్లో కళ్లు చెదిరే స్థాయిలో అక్రమాస్తులు బయటపడ్డాయి. ఏకంగా రూ.1.54 కోట్లు, కిలో బంగారం భారీగా స్థిరచరాస్తుల పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మధ్య కాలంలో ఏసీబీ దాడుల్లో ఇంట్లో అత్యధికంగా నగదు పట్టుబడిన కేసు ఇదేనని అధికారులు చెబుతున్నారు.అక్రమంగా ఆస్తులు కూడబెట్టిన అధికారులపై ఏసీబీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. లాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో ఏకంగా రూ.1.54 కోట్లు, కిలో బంగారంతో పాటు కీలకమైన ల్యాండ్ డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మట్టుత్తం 11 చోట్ల ఆరుగురు డీఎస్పీలు 20 మంది ఇన్‌స్పెక్టర్లతో సోదాలు నిర్వహించారు. అత్తాపూర్, మియాపూర్, గచ్చిబౌలి లాంటి ఖరీదైన ప్రాంతాల్లో బినామీ పేర్లపై ఉన్న ఓపెన్ ప్లాట్లు, విల్లాలతో పాటు, రంగారెడ్డి జిల్లాలో భారీగా వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. ప్రస్తుతానికి ఈ సోదాల్లో దొరికిన నగదు, నగలు, డాక్యుమెంట్ల ప్రభుత్వ విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని, బహిరంగ మార్కెట్లో వీటి విలువ 200 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. సోదాలు చేశామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.ఇటీవలి కాలంలో ఇంత పెద్ద మొత్తంలో నగదు పట్టుబడటం ఏసీబీ చరిత్రలోనే సంచలనంగా మారింది. గతంలో జలమండలి జనరల్ మేనేజర్ ఇంట్లో కోటీ పది లక్షల రూపాయలు, రెండు కిలోల బంగారం పట్టుబడగా ఆర్ అడ్ బీ ఈఎన్?సీ మోహన్ నాయక్ ఇంట్లో 65 లక్షల నగదు బంగారు బిస్కెట్లు లభ్యమయ్యాయి. అయితే వాటన్నింటినీ మించి ప్రస్తుతం నరహరి ఇంట్లో ఏకంగా 1.54 కోట్ల నగదు దొరకడం సంచలనం సృష్టిస్తోంది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయనకు వచ్చిన చట్టబద్ధమైన ఆదాయం కూడబెట్టిన స్థిరాస్తుల విలువలపై అధికారులు పక్కాగా లెక్కగడుతున్నారు. సోదాలు ఇంకా కొనసాగుతుండటంతో ఈ అవినీతి తిమింగలం అక్రమాస్తుల చిట్టా మరింత పెరిగే అవకాశం ఉంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

## టెలిగ్రామ్‌పై కేంద్రం కీలక నిర్ణయం

- నీట్ పరీక్ష అయ్యే వరకు బ్యాన్



**టీ మీడియా,జూన్16, ఢిల్లీ బ్యూరో :**

వైద్యకళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్ పరీక్షను తిరిగి నిర్వహించనున్న నేపథ్యంలో కేంద్రం కీలకనిర్ణయం తీసుకుంది. పరీక్షకు సంబంధించి సమాచారం లీక్ చేసేందుకు అవకాశం లేకుండా మెసేజింగ్ ప్లాట్‌ఫాం టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా బ్లాక్ చేసింది. ఎన్?టీఏ సిఫార్స్ మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ఆంక్షలు కేవలం పరీక్షా సమయం, ఆ తర్వాత కొంతకాలానికి మాత్రమే పరిమితమని ఎన్?టీఏ పేర్కొంది.ఈ నిర్ణయం వల్ల టెలిగ్రామ్‌ను ఉపయోగించే లక్షలాది మంది యూజర్లకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ఎన్?టీఏ తెలిపింది. జూన్ 30వరకు 'మెసేజ్-ఎడిటింగ్' ఫీచర్‌ను కూడా నిలిపివేయాలని టెలిగ్రామ్‌ను కేంద్రప్రభుత్వం ఆదేశించింది. గతంలో అడ్మినిస్ట్రేటర్లు అంతకుముందు పోస్ట్ చేసిన సందేశాలను ఎడిట్ చేయడానికి, అటాచ్ చేసిన ఫైళ్లను మార్చినప్పటికీ టైమ్‌స్టాంప్ అలాగే ఉండేలా చేయడానికి ఈ ఫీచర్‌ను దుర్వినియోగం చేశారని, తద్వారా పేపర్ లీక్ అయినట్లు తప్పుడు ఆధారాలను సృష్టించారని తెలిపింది. నీట్ అభ్యర్థులను మోసగించడానికి చీటింగ్ రాకెట్లు ఈ ప్లాట్‌ఫారమ్‌ను వ్యవస్థీకృతంగా వినియోగిస్తుండటానికి ప్రతిస్పందనగా శాంతిభద్రతల పరిరక్షణ ప్రజాప్రయోజనాల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది.

# మమత వర్గంతో చర్చించాకే

● **టీఎంసీ రెబల్ ఎంపీల విలీనంపై స్పీకర్ నిర్ణయం!**

**టీ మీడియా,జూన్16, ఢిల్లీ బ్యూరో :**

టీఎంసీ పార్టీ రెబల్ ఎంపీలు తాము నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో (ఎన్‌సీపీఐ) విలీనమయ్యామని, తమకు లోక్‌సభలో ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని స్పీకర్ ఓం బిర్లాను కోరిన నేపథ్యంలో ఆయన నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీల స్థితిగతులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పరిశీలిస్తున్నారని, రెండు వర్గాల వాదనలు విన్న తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే లోక్‌సభ స్పీకర్ కార్యాలయం మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ఎంపీల బృందానికి అధికారిక సమావేశం కోసం ఆహ్వానిస్తూ ఈ-మెయిల్ పంపిందని స్పష్టం చేశాయి. తిరుగుబాటు వర్గం కోరిన విలీన అభ్యర్థనపై, పార్టీ అధికారిక నాయకత్వంతో చర్చించిన తర్వాతే స్పీకర్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వెల్లడించాయి. కాగా, టీఎంసీ లోక్‌సభ సభ్యుల బృందంలో అధికారికంగా చీలిక ఏర్పడిన నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది.

**పదవుల కోసం టీఎంసీ రెబల్ ఎంపీలు కొట్లాడుకుంటున్నారు**

కీర్తి ఆజాద్నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యామని ఇటీవలే తిరుగుబాటు టీఎంసీ ఎంపీలు ప్రకటించారు. తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విజ్ఞప్తి చేశారు. తమకు తృణమూల్ మొత్తం ఎంపీల్లో 2/3వంతుకు మించి మెజారిటీ ఉందన్నారు. అందుకే ముందడుగు వేస్తున్నామని, ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏతో కలిసి దేశం కోసం పని చేస్తామని వివరించారు. ఈ పరిణామంపై



టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ స్పందించారు. ఈ చర్యను తప్పుదోవ పట్టించేది, అప్రజాస్వామికమని మండిపడ్డారు. టీఎంసీ పార్టీ పూర్తిగా మమతా బెనర్జీ నాయకత్వంలోనే ఉందని స్పష్టం చేశారు. పార్లమెంటరీ స్థాయిలో అసలు ఉనికి లేని పార్టీలో టీఎంసీ రెబల్ ఎంపీలు ఎలా విలీనం అవుతారు? అని ప్రశ్నించారు. పదవుల కోసం రెబల్ ఎంపీలు తమలో తాము కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు.

**'మమతదే టీఎంసీ పార్టీ'**

"నిజమైన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మమతా బెనర్జీదే. టీఎంసీ మమతదేనని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నాం. 20 మంది తిరుగుబాటు టీఎంసీ ఎంపీలు స్పీకర్‌కు ఇచ్చిన లేఖ తప్పుదోవ పట్టించేలా ఉంది. తిరుగుబాటు ఎంపీల బృందం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తోంది. ఇప్పటికే వారిలో అంతర్గత విభేదాలు తలెత్తాయి. ఎవరు మంత్రి కావాలనే విషయంలో ఆ ద్రోహుల (తిరుగుబాటు టీఎంసీ ఎంపీలనుద్దేశించి) మధ్య వివాదం నెలకొంది. రెబల్ ఎంపీలు విలీనం అయిన పార్టీ(నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా)కి పార్లమెంట్‌లో ఎలాంటి ప్రాతినిధ్యం లేదు, అది గుర్తింపు లేని, రిజిస్టర్ కాని పార్టీ. దానికి ఎలాంటి ఉనికి లేదు. ఆ పార్టీలో తిరుగుబాటు టీఎంసీ ఎంపీల విలీనం ప్రజాస్వామ్యబద్ధం కాదు. " అని కీర్తి ఆజాద్ తెలిపారు.

**వార్తల్లో నిలిచిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా**

ఏమాత్రం పేరు ప్రఖ్యాతులు లేని నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. అందుకు ప్రధాన కారణం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది తిరుగుబాటు ఎంపీలు అందులో విలీనం కావాలని నిర్ణయించుకోవడమే. ఈ పార్టీకి ఎంపీ, ఎమ్మెల్యేలు గానీ లేరు. కాగా, 2023లో జరిగిన త్రిపుర శాసనసభ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా బరిలోకి దిగింది. పార్టీ ఫిరాయింపులు చేసే వారిని తిరస్కరించాలన్న నినాదంతో ఆ పార్టీ ఎన్నికల ప్రచారం చేసింది. పోటీ చేసిన మూడు స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు రావడం గమనార్హం.నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ అధ్యక్షుడిగా బంగాల్‌కు చెందిన ఉట్టియ కుందు ప్రస్తుతం సేవలందిస్తున్నారు. అయితే తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీలు చేసిన ప్రతిపాదనకు స్పీకర్ ఓంబిర్లా ఆమోదముద్ర వేస్తే లోక్‌సభలో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఐదో పెద్ద పార్టీగా నిలుస్తుంది. ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ తొమ్మిదో స్థానానికి పడిపోతుంది.

## రూ.70 వేలకు రూ.1.33 లక్షలు వసూలు

● **ఇంకా అసలు బాకీ ఉందంటూ ఆటోలాక్కెళ్లారు**

**టీమీడియా, జూన్ 16 , ఆదిలాబాద్ :**



అధిక వడ్డీ పేరుతో బాధితుడిని వేధిస్తూ, అతని ఆటోను బలవంతంగా అపహరించిన ముగ్గురు నిందితులను ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలల్లోకి వెళితే ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ కాలనీకి చెందిన తాహేర్ అలీ అనే ఆటో డ్రైవర్ తన అవసరాల నిమిత్తం పిట్టలవాడకు చెందిన పండిగొట్టి కొండయ్య అతని భార్య పండిగొట్టి లక్ష్మి వద్ద రూ.70,000 లను 10% వడ్డీతో అప్పు తీసుకున్నాడు. అప్పు తీసుకున్న అనంతరం నెలవారీ వడ్డీ చెల్లిస్తూ ఇప్పటివరకు సుమారు రూ.1,33,000 చెల్లించాడు. అయితే ఇంకా అప్పు తీరలేదని అసలు ఇంకా అలాగే ఉందని వెంటనే చెల్లించాలంటూ బాదితుడిని వేధింపులకు గురి చేశారు.అక్కడితో ఆగకుండా బాదితుడి ఉపాధిపై దెబ్బ కొట్టేలా అతని ఆటోను ఇంటి నుండి బలవంతంగా లాక్కెల్లారు. పోలీసులను ఆశ్రయించిన బాధితుడు తన గోడును పోలీసులకు వెళ్లబోసుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.అరెస్ట్ అయిన నిందితులు ఏ 1 పండిగొట్టి కొండయ్య, ఏ2 పండిగొట్టి లక్ష్మి , ఏ3 సిందే మురళి ఏ మాధవ్, పిట్టలవాడ, ఆదిలాబాద్ కు చెందిన వారిగా తెలిపారు పోలీసులు. అనుమతి లేకుండా అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## రాష్ట్ర మహాసభల కర పత్రాలు విడుదల

**టీ మీడియా, జూన్ 16 పెబ్బేరు**



: వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామంలో ఉపాధి పని ప్రదేశం లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ జిల్లా ఉపాధ్యక్షులు దేవన్న మాట్లాడుతూ సంఘశీ రాష్ట్ర 4వ మహాసభ లు ఈ నెల 20 21 22 తేదీలలో మహబూబ్ నగర్ పట్టణశీలో జరుగుతాయని 20న జరిగే బహిరంగ సభ కు ముఖ్య అతిథిగా త్రిపుర మాజీ ముఖ్య మంత్రి మాణిక్ సర్కార్ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని విరభద్రం కె వి పి ఎస్ రాష్ట్రఅధ్యక్షులు జాన్ వెస్లీ అఖిల భారత వ్యవసాయకార్మిక సంఘశీ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ శివ దాసన్ ఎంపిలు హాజరు అవుతున్నారని తెలిపారు మొదటి రోజు 20న మహబూబ్ నగర్ టౌన్ హాల్ నుంచి భారీ ప్రదర్శన జూనియర్ కాలేజీ గ్రౌండ్ లొ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు 21 22 తేదీలలో 33జిల్లాల నుంచి 1000 మంది ప్రతినిధులు హాజరు అవుతున్నారు దేశంలొ బిజెపి ఉపాధిని ఎత్తి వేసే క్రమంలో కొత్తగా నరేంద్ర మోడీ చట్టం తెచ్చి కేంద్రం యిచ్చే 90%నిధులను 60%కి తగ్గించారని దింతో రాష్ట్ర ప్రభుత్వాలు 40%భరించలనే కోర్రి పెట్టటడం తో రానున్న రోజుల్లో ఉపాధి హామీ చట్టం లొ కూలీలకు పనిదినాలు కల్పించడంలొ కేంద్రం విఫలం అవుతుందని విమర్శించారు కనీసవేతనాలు అమలు చేయాలనీ రేషన్ షాప్ ల ద్వారా 14రకాల నిత్యవసర సరుకులు ఇవ్వాలని డీమాండ్ చేశారు ఈ కార్యక్రమం కూలీలు శంకర్ అనిల్ నాగరాజు బాలయ్య రాముడు సాయులు సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ టెస్ట్

● **నిబంధనలు ఉల్లంఘించిన 245 వాహనాలు**

**టీమీడియా జూన్ 16, హైదరాబాద్ బ్యూరో :**

విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమైన తొలి రోజే తెలంగాణ రవాణా శాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి స్కూల్, కాలేజీ బస్సుల భద్రతపై దృష్టి సారించింది. ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుస్తున్న 245 విద్యాసంస్థల వాహనాలను అధికారులు గుర్తించగా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న 60 స్కూల్ బస్సులను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థుల భద్రతే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పలు కీలక లోపాలు వెలుగుచూసినట్లు అధికారులు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించారు. అలాగే డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే లైసెన్సులు ఉన్నాయా, వారికి తగిన డ్రైవింగ్ అనుభవం ఉందా అనే అంశాలను కూడా తనిఖీ చేశారు. విద్యార్థుల భద్రతకు అవసరమైన ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు,



ఎమర్జెన్సీ ఎగ్జిట్లు, అటెండెంట్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.అంతేకాకుండా బస్సుల బ్రేకులు, టైర్లు, లైట్లు వంటి యాంత్రిక భాగాల పనితీరును కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని వాహనాల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, మరికొన్నింటిలో అవసరమైన పత్రాలు లేకపోవడం గుర్తించినట్లు సమాచారం. విద్యార్థుల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో ఎలాంటి రాజీ ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు.

ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుస్తున్న వాహనాలు లేదా సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్న బస్సులను వెంటనే సీజ్ చేస్తామని రవాణా శాఖ హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వాహన యజమానులు, డ్రైవర్లు మాత్రమే కాకుండా సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపింది. విద్యార్థుల భద్రత విషయంలో యాజమాన్యాలదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేసింది.రవాణా శాఖ గణాంకాల ప్రకారం తెలంగాణలో మొత్తం 25,987 విద్యాసంస్థల బస్సులు ఉండగా, వాటిలో 23,204 బస్సులకు మాత్రమే చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయి. మిగిలిన 2,783 బస్సులు తక్షణమే ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందాలని అధికారులు ఆదేశించారు. తమ పిల్లలను స్కూల్ బస్సుల్లో పంపే ముందు తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఓవర్‌లోడింగ్ లేదా నిబంధనలు పాటించని వాహనాల గురించి అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.విద్యార్థుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని రవాణా శాఖ హెచ్చరించింది.

## దొరకని రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి జాడ..

● **కొండచిలువ మింగేసిందా?**

**టీ మీడియా,జూన్16, కాకినాడ :**



కాకినాడ జిల్లా తుని మండలంలో అడవిలోకి వెళ్లి అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి (జానూ) కేసు రోజురోజుకీ మరింత మిస్టరీగా మారుతోంది. పది రోజులుగా వందలాది మంది పోలీసులు పాప కోసం గాలిస్తున్నా.. ఒక్క క్లూ కూడా దొరక్కపోవడంతో అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే పాప మిస్సింగ్‌పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా చిన్నారిని కిడ్నాప్ చేశారా? లేక అటవీ ప్రాంతంలో క్రూర జంతువు దాడి చంపిందా అనే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి.కొండచిలువలు లేదా ఇతర అడవి జంతువులు చిన్నారిని తీసుకెళ్లి ఉండవచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నక్కలు లేదా వేటకుక్కల తరహా జంతువులు చిన్నారిని కొండ ప్రాంతాలకు తీసుకెళ్లి ఉండవచ్చని చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలోనే తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు ఈ ప్రచారానికి ఊతమిచ్చారు. చిన్నారి జ్ఞానేశ్వరి (జానూ) కొండచిలువ బారిన పడి ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల్లోనే పాప సహా ఆనవాళ్లు కనిపించకుండా పోతాయని తెలిపారు. అయితే అటవీ శాఖ అధికారులు మాత్రం దీన్ని ఖండించారు. ఆ ప్రాంతంలో మనుషులపై క్రూర మృగాలు, ఇతర వన్యప్రాణులు దాడి చేసిన ఘటనలు నమోదైన దాఖలాలు లేవని అటవీ శాఖ అధికారి పట్టాభి స్పష్టం చేశారు.చిన్నారి అదృశ్యమైన పోలీసులు విస్తృత గాలింపు చేపట్టారు. ఈ కేసును అన్ని కోణాల్లో విస్తృతస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. కానీ ఇంతవరకు ఏ క్లూ దొరకలేదని.. సాంకేతిక ఆధారాలు కూడా లభ్యం కాలేదని పేర్కొన్నారు. అయితే అడవి జంతువుల వల్ల కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉందని చెప్పారు. చిన్నారి అదృశ్యమైన పరిస్థితిని బట్టి ముందస్తు ప్రణాళిక ప్రకారం కిడ్నాప్ చేశారని అనుకోలేమని తెలిపారు. పాప తనకు తానే నడిచి వెళ్లిందని.. కేవలం 30 నిమిషాల్లోనే ఇదంతా జరిగిందని పాప తల్లిదండ్రులు చెబుతున్నారని అన్నారు. అడవిలో పాప కనిపిస్తే ఎవరైనా తీసుకెళ్లారా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని.. ఇంకా దీనిపై స్పష్టత రాలేదని అన్నారు. హఠాత్తుగా ఏదో జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారు. పాప మిస్సింగ్‌పై కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని.. అది సరికాదని హితవుపలికారు. చిన్నారి వెంట వెళ్లొచ్చిన శునకం డీహైడ్రేట్ అయ్యి చనిపోయిందని తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతనే మిగతా విషయాలు తెలుస్తాయన్నారు.

## ఎసిబి ఆఫీస్ ముందు అరెస్టు

**టీ మీడియా, జూన్ 16, వనపర్తి బ్యూరో :**



తెలంగాణ బంజార గిరిజన విద్యార్థి సమైక్య అధ్యక్షుడు శివ నాయకును హైదరాబాదులో పోలీస్లు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్ళగాలంబాడా సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఏసీబీ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఏసీబీ కార్యాలయం ముట్టడించిన బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్‌ను మంగళవారం నాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శివ నాయక్ మాట్లాడుతూ, లంబాడా (బంజారా) సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తూ జరుగుతున్న ఏసీబీ దాడులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారిపై వరుసగా దాడులు నిర్వహించడం పట్ల బంజారా సమాజంలో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు. ఏసీబీ అధికారులు నిష్పాక్షికంగా వ్యవహరించి, ఏ వర్గాన్నీ ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకోకుండా చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లంబాడా సమాజంపై వివక్షపూరిత ధోరణి కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఏసీబీ కార్యాలయం ముట్టడి సందర్భంగా శివ నాయక్‌తో పాటు గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారా వర్కింగ్ ప్రెసిడెంట్ డాన్ శ్రీను, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాక్ పతి నాయక్, సుధీర్,చక్ర మధు, పలువురు బంజారా యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అక్కడికి చేరుకున్న పోలీసులు శివానాయక్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బంజారా సమాజ హక్కులు, గౌరవం కోసం తమ పోరాటం కొనసాగుతుందని శివ నాయక్ తెలిపారు

## పీర్ల చావడిని పరిశీలించిన మున్సిపల్ పాలక వర్గం

**టీ మీడియా, జూన్ 16 ,పెబ్బేరు:**



పెబ్బేరు పట్టణంలోమొహరం పండుగను పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక పీర్ల చావడిని మున్సిపల్ చైర్మన్ అక్క శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్రా ఎల్లరెడ్డి కౌన్సిలర్లు పరిశీలించారు ఈ సందర్భంగా చావడి ఆవరణలో పండుగ నిర్వహణ కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను దగ్గరుండి పర్యవేక్షించారు మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ హిందూ ముస్లింల సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం పండుగను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని ఈ క్రమంలో చావడికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి కౌన్సిలర్లు సౌజన్య దిలీప్ రెడ్డి జములమ్మ భాగ్యలక్ష్మి శివ పీర్ల చావడి కమిటీ సభ్యులు ఎండి షబ్బీర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సహజ ప్రసవాలు ప్రోత్సహించేలా

● **"సీ-సేఫ్" కార్యక్రమానికి శ్రీకారం**

**టీ మీడియా,జూన్16, అమరావతి బ్యూరో :**

సహజ ప్రసవాలను ప్రోత్సహించడానికి, సిజేరియన్లను తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రసూతి సేవలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సీ- సేఫ్ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో మితిమీరిన సిజేరియన్లకు అడ్డుకట్ట వేసి పరిస్థితిని చక్కదిద్దేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో నాలుగు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ ఫలితాలను విశ్లేషించి 2026 నవంబరు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

**నాలుగు ప్రభుత్వాస్పత్రుల్లో అమలు**

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం సీ - సెక్షన్ ప్రసవాలు 10 నుంచి 15 శాతం లోపే ఉండాలి. రాష్ట్రంలో పరిస్థితి చేయి దాటింది. దీంతో సహజ ప్రసవాలను పెంచేందుకు సీ- సేఫ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రస్తుతం మచిలీపట్నం, ఏలూరు, రాజమహేంద్రవరం జీజీహెచ్?లతో పాటు, తణుకు జిల్లా ఆస్పత్రిలో సీ-సేఫ్‌ను అమలు చేస్తున్నారు.లివర్‌పూల్, బర్మింగ్‌హామ్ వర్సిటీలు, ఫెర్నాండెజ్ ఫౌండేషన్, యునిసెఫ్ భాగస్వామ్యంతో మాతాశిశు మరణాలను తగ్గించడంతో పాటు, వైద్య సేవల్లో నాణ్యతను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సహజ ప్రసవాలను విజయవంతంగా నిర్వహించేందుకు గైనకాలజిస్టులకు, స్టాఫ్ నర్సులకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.



**అవసరమైనప్పుడు మాత్రమే చేయించుకోవాలి**

సీ-సేఫ్ అమలుతో మచిలీపట్నం జీజీహెచ్?లో సాధారణ ప్రసవాలు 23 నుంచి 34 శాతానికి పెరిగాయి. సీ -సెక్షన్ డెలివరీలు 77 నుంచి 66 శాతానికి తగ్గాయి. ఏలూరు జీజీహెచ్?లో సిజేరియన్ల తర్వాత ఇన్ఫెక్షన్ల రేటు 62 నుంచి 31శాతానికి తగ్గినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు 57.89 శాతం, సిజేరియన్లు 42.11 శాతం జరుగుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు 32.24 శాతం, సిజేరియన్ ప్రసవాలు 67. 16 శాతం చొప్పున జరుగుతున్నాయి. వైద్యులు గుర్తించారు. అవసరమైనప్పుడు మాత్రమే సిజేరియన్లు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

**తల్లిబిడ్డ ఆరోగ్యానికి ముప్పు**

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సీ -సెక్షన్ డెలివరీలపై ఆడిట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎక్కువ మంది గర్భిణీలు పురిటి నొప్పుల భయం, ఇతరత్రా కారణాలతో సిజేరియన్ల వైపు మొగ్గుచూపుతున్నారని వైద్యులు తెలిపారు. సిజేరియన్ వల్ల మరణాలు, తల్లిబిడ్డ ఆరోగ్యానికి ముప్పు ఉందని హెచ్చరిస్తున్నారు. కష్టమైనా సాధారణ ప్రసవాలను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. సహజ ప్రసవాలను పెంచేందుకు, సిజేరియన్లను తగ్గించేందుకు ప్రభుత్వం చేపడుతున్న సీ-సేఫ్ కార్యక్రమం విజయవంతమైతే ఈ ఏడాది నవంబర్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు.

## ఇంద్రకీలాద్రిపై వేగంగా అభివృద్ధి పనులు

**టీ మీడియా,జూన్16, విజయవాడ :**



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయ స్వరూపం త్వరలోనే పూర్తిగా మారనుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

**భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు**

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు రూ. 82 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఈ చారిత్రాత్మక మార్పుల ద్వారా దుర్గమ్మ దర్శన అనుభవం సంపూర్ణంగా మారనుంది. బెజవాడ కొండపై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ఆరు అంతస్తుల ప్రసాదం పోటు, నూతన అన్నప్రసాదం కాంప్లెక్స్ పనులు చాలా వరకూ పూర్తి అయ్యాయి. మాస్టర్ ప్లాన్‌లో కీలకమైన రూ. 13 కోట్ల నిర్మిస్తున్న ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ వల్ల కిలోమీటర్ల మేర రోడ్లపై వేచి ఉండే ఇబ్బందులు తప్పనున్నాయి.ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, పసిపిల్లలతో వచ్చే తల్లుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా భక్తులకు ఇబ్బంది లేకుండా నేరుగా కొండపైకి చేరుకుని దర్శనం చేసుకునేలా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు అమ్మవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, పంపిణీని మెరుగుపరిచేందుకు రూ. 27 కోట్ల వ్యయంతో ఆరు అంతస్తుల భారీ ప్రసాదం పోటు భవనాన్ని నిర్మిస్తున్నారు. అత్యాధునిక ఆటోమేటెడ్ మిషన్లతో పరిశుభ్రమైన వాతావరణంలో లడ్డూలను తయారు చేస్తారు.


**ఇబ్బంది లేకుండా దర్శనం**

దీనివల్ల రద్దీ రోజుల్లో కూడా భక్తులకు ప్రసాదాల కొరత రాకుండా ఉండేందుకు అధికారులు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఎంతోకాలంగా కొండపై ఉన్న పార్కింగ్ కష్టాలనూ తీర్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ వర్షాకాలంలో ఆలయం సమీపంలో కొండచరియలు విరిగిపడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని ఈవో శీనానాయక్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై పనులన్నీ పూర్తైతే భక్తులకు మరిన్ని వసతులు అందుబాటులో వస్తాయని ఆలయ అధికారులు చెబుతున్నారు.

## మూసాపేట్‌లో భారీ అగ్ని ప్రమాదం

● **60 బైకులు దగ్ధం**


**టీ మీడియా,జూన్16, హైదరాబాద్ :**



నగరంలోని మూసాపేట్ గూడ్స్ షెడ్ ప్రాంతంలో మంగళవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు నిల్వ ఉంచిన ఓ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గోదాం నుంచి భారీగా దట్టమైన పొగ ఎగసిపడుతూ కనిపించడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గోదాంలో పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్ వాహనాలు నిల్వ ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఫైర్ ఇంజిన్ల సాయంతో అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కొన్ని గంటల శ్రమ తర్వాత మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి.ఈ ప్రమాదంలో సుమారు 60 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమైనట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రమాదం సంభవించిన సమయంలో గోదాంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో పెద్ద విషాదం తప్పిందని అధికారులు పేర్కొన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ సర్వీస్ సెంటర్‌కు చెందిన గోదాంను యాజమాన్యం గత ఎనిమిది నెలలుగా మూసివేసి ఉంచినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ అక్కడ వాహనాలు నిల్వ ఉండటం గమనార్హం. షార్ట్ సర్క్యూట్ లేదా ఇతర సాంకేతిక కారణాల వల్ల మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నప్పటికీ, ఖచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అగ్నిప్రమాదానికి గల అసలు కారణాలను గుర్తించేందుకు ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో విచారణ చేపడుతున్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

**టీ మీడియా, జూన్ 16 పెబ్బేరు:"**



ఎబ్బేరు మండలంలోని శాఖా పూర్ గ్రామానికి చెందిన రైతాంగ పోరాట సమితి అధ్యక్షుడు జక్కుల వెంకటయ్య రైతుల సమస్యలపై మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను ఉచితంగా సరఫరా చేసి నకిలీ విత్తనాల సరఫరా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలి కౌలు రైతులకు 2011 కౌలు దారి చట్టాన్ని అమలు చేయాలి వర్షాకాలం వచ్చింది కానీ పంటలకు సరిపడ వర్షాలు కురవడం లేదు జూన్ లో ఎల్ నినో వచ్చింది ఈ కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి రాష్ట్రంలో వర్షం కురిస్తేనే 50 శాతం వర్షాధార పంటలే సాగు చేస్తారు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 300 పంట రకాలు ఉంటే కేవలం 14 పంటల ధరలను క్వింటాలకు వంద రూపాయలలోపే పెంచి ఎరువుల ధరలు మాత్రం 50 కేజీల బస్తాకు వేల రూపాయలను పెంచేశారు ఒకవైపు పశ్చిమ ఆసియా యుద్ధాల కారణంగా పెట్రోలు డీజిల్ పెరగడం పరోక్షంగా వ్యవసాయం మీద తీవ్ర ప్రభావం పడి అతివృష్టి అనావృష్టి తదితర రకరకాల సమస్యలతో రైతుల ఉత్పత్తి ఖర్చులు ఒకటికి రెండంతలు పెరుగుతున్నాయి.లి యాసంగి రైతు భరోసా తో పాటు ఖరీఫ్ రైతు భరోసాను వెంటనే రైతుల ఖాతాలలోకి జమ చేయాలి కౌలు రైతులకు 2011 సం కౌలుదారుల చట్టాన్ని వెంటనే అమలు చేసి రైతు భరోసా పథకాన్ని వర్తింపజేసి బ్యాంకులు పంటల రుణాలను ఇవ్వాలిఅన్ని రకాల నాణ్యమైన విత్తనాలను ఉచితంగా సరఫరా చేసి నకిలీ విత్తనాలను సరఫరా చేసే వారిని కఠినంగా శిక్షించాలి.కరువు వల్ల వేసిన పంటలు ఎండిపోతే ఎకరా చొప్పున పరిహారం చెల్లించాలని అన్నారు.

## డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే దగ్గు సిరప్‌లు..

**టీ మీడియా,జూన్16, ఢిల్లీ బ్యూరో :**

దగ్గు సిరప్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. దగ్గు సిరప్‌లను కొనేందుకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి అని కేంద్రం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో నోటీఫికేషన్ జారీ చేసింది. 1945 నాటి డ్రగ్ రూల్స్ లోనూ సవరణలు చేశారు. తమిళనాడుకు చెందిన శ్రీసన్ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగి సుమారు 20 మంది చిన్నారులు మృతిచెందారు. అయితే ఆ ఘటన పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ తయారీకి చెందిన దగ్గు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌వో తన హెచ్చరికల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. 2026 డ్రగ్స్ రూల్స్‌ను కేంద్రం నోటిఫై చేసింది. పాత చట్టానికి సవరణలు చేశారు.షెడ్యూల్ కేలో భాగంగా సిరప్ పదాన్ని ఆ కేటగిరీ నుంచి తొలగించారు. డ్రగ్స్ యాక్ట్ 1940 ప్రకారం ఆ కేటగిరీలో కొన్ని మందుల తయారీ, సరఫరా, అమ్మకాలపై నిషేధం మినహాయింపు ఇస్తారు. షెడ్యూల్ కేలో ఉన్న డ్రగ్స్‌ను ఎటువంటి లైసెన్సు లేకుండానే అమ్ముకోవచ్చు. ఇంటి చిట్కాలుగా భావిస్తూ ఆస్పరిన్, పారాసిటమాల్, అనల్జసిక్ బామ్స్ లాంటి కొన్ని మందులు అమ్ముకునేందుకు వీలు ఉంది.అయితే ఇప్పుడు ఆ షెడ్యూల్ నుంచి సిరప్ అనే పదాన్ని తొలగించారు. ప్రభుత్వం అధికారిక గెజిట్ ప్రచురించడం వల్ల కొత్తగా చేపట్టిన సవరణ అమలులోకి వచ్చేస్తుంది.

# మిరప రైతులకు లాం పరిశోధనా కేంద్రం శుభవార్త

● కొత్త వంగడాల విక్రయాలు షురూ

**టీ మీడియా,జూన్16, అమరావతి బ్యూరో :**

మిరప రైతులకు గుంటూరులోని లాం ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం శుభవార్త చెప్పింది. అధిక దిగుబడినిచ్చే కొత్త మిరప విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. వాతావరణ మార్పులు, తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకునే అద్భుతమైన రకాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. అందులో ఎల్‌సీఏ 643, ఎల్‌సీఏ 625 అనే రెండు రకాల విత్తనాలను ప్రస్తుతం రైతులకు విక్రయిస్తున్నారు. ఈ విషయాన్ని పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ టి.సుశీల ప్రకటించారు.

**విత్తనాల కొనుగోలు వివరాలు**

ఈ రెండు కొత్త రకాల మిరప విత్తనాల అమ్మకాలను మంగళవారం నుంచే ప్రారంభించారు. విత్తనాలు కావాల్సిన రైతులు నేరుగా లాం ఉద్యాన పరిశోధనా కేంద్రానికి వెళ్లాలి. అమ్మకాల సమయం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ప్రభుత్వ సెలవు దినాల్లో విక్రయాలు ఉండవు. (రెండో శనివారం, ఆదివారం విత్తనాలు ఇవ్వరు). నాణ్యమైన ఈ విత్తనాల ధరను కిలోకు రూ.1,200 గా నిర్ణయించారు. అయితే, అందరికీ విత్తనాలు అందాలనే ఉద్దేశంతో పరిమితి విధించారు. కేవలం ఒక్కో రైతుకు 250 గ్రాముల విత్తనాలను మాత్రమే పంపిణీ చేస్తారు.

**ఎల్‌సీఏ 643 రకం ప్రత్యేకతలు**

ఈ రకం విత్తనాలు సాగు చేసే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని



అధికారులు చెబుతున్నారు. ఇది పచ్చి మిరప, ఎండు మిరప సాగుకు చాలా అనుకూలమైన రకం. ఈ మిరప కాయలు లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. వీటి పొడవు 13 నుంచి 14 సెంటీమీటర్ల వరకు ఉంటుంది. ఇవి ఎండిన తర్వాత కాయలకి కొంచెం ముడత వస్తుంది. అచ్చం ప్రసిద్ధ 'బ్యాడగి' రకం మిరపలా ఇవి ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఈ రకానికి బెట్టను తట్టుకునే శక్తి చాలా ఎక్కువ. మిరపను తీవ్రంగా నష్టపరిచే 'జెమిని వైరస్'ను కూడా ఇది కొంతవరకు తట్టుకోగలదు. కొద్దిపాటి పురుగుమందులు పిచికారీ చేస్తే చాలు, రైతులను భయపెట్టే నల్లతామర పురుగు ఉద్ధృతిని సులభంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు.

**ఎల్‌సీఏ 625 రకం ప్రత్యేకతలు**

నాణ్యమైన ఎండు మిరప కోసం చూసే రైతులకు ఈ రకం ఎంతో అద్భుతంగా పనిచేస్తుందని అధికారులు అంటున్నారు. ఈ రకం విత్తనాలు ప్రత్యేకంగా ఎండు మిరప సాగుకు ఎంతో అనువైనవి. దీని కొమ్మలు చాలా బలంగా, ఎత్తుగా పెరుగుతాయి. కణుపులు దగ్గరగా ఉంటాయి. కాయల కాపు కూడా చాలా చిక్కగా వస్తుంది. ఇవి నేరుగా ఎద పెట్టడానికి ఎంతో అనువైన రకం. కాయలు సన్నగా ఉంటాయి. పొడవు 8 నుంచి 10 సెంటీమీటర్ల మధ్య ఉంటుంది. చూడటానికి ఇవి 'తేజ' రకం మిరపను పోలి ఉంటాయి. పచ్చి కాయ ముదురు ఆకుపచ్చ రంగులో నిగనిగలాడుతుంది. సూటి రకాలలో దీనికి ఘాటు అత్యధికం. దీని ఘాటు తీవ్రత 45,000 - 50,000 ఎస్.హెచ్.యు వరకు ఉంటుంది. రంగు కూడా ఆకర్షణీయమైన ఎరుపు రంగులో 60 - 65 ఎ.ఎస్.టి.ఏ ప్రమాణాలతో ఉంటుంది. ఈ కాయల తోలు పలచగా ఉంటుంది. కాయకుళ్లు తెగులును ఇది కొంతవరకు తట్టుకుంటుంది. ఇందులో తాలు కాయలు (పనికిరానివి) చాలా తక్కువగా వస్తాయి. తద్వారా రైతుకు నష్టం తప్పుతుంది.


**మరిన్ని వివరాలకు**

విత్తనాల గురించి, సాగు పద్ధతుల గురించి రైతులు నేరుగా అధికారులను సంప్రదించవచ్చు. ఇందుకోసం లాం ఉద్యాన పరిశోధనా స్థానం అధికారులు ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు. 99898 09554, 94405 92982 నంబర్లను సంప్రదించవచ్చు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక లాభాలు పొందాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

# నిరంజన్ కోరిక తీర్చనున్న పవన్ కల్యాణ్

● నేడు జనసేనాని వరంగల్ పర్యటన

**టీ మీడియా,జూన్16, వరంగల్ :**



అభిమాని కోరిక తీర్చేందుకు జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రేపు వరంగల్ వస్తున్నారు. హనుమకొండలో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న నిరంజన్? అనే పిల్లాడిని జనసేనాని పరామర్శించనున్నారు. పవన్?కల్యాణ్?ను? చూడాలనే తన చివరి కోరిక మేరకు అతని ఇంటికి వెళ్లనున్నారు. అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకోనున్నారు.

**ఎవరీ నిరంజన్**

హనుమకొండకు చెందిన నిరంజన్ (16) అందరిలా ఆడుతూ పాడుతూ పాఠశాలకు వెళ్లేవాడు. కానీ, 8 ఏళ్ల క్రితం అతడి జీవితం ఒక్కసారిగా మారిపోయింది. జన్యుపరమైన డీఎండీ వ్యాధి బారిన పడి పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. ఎదుగుదలపూర్తిగా లోపించింది. కాస్తగట్టిగా పట్టుకుంటేభరించలేని నొప్పిఅంటాడు.తమకుమారుడిస్థితినిచూసికన్నీరుమున్నీరవుతున్నారు నిరంజన్ తల్లిదండ్రులు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినా కుమారుడిని చంటిబిడ్డలా చూసుకుంటున్నారు. ఆర్థికంగా నిస్సహాయ స్థితిలో ఉన్న వారు.. ప్రభుత్వం, దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల టీవీలో సీఎం రేవంత్ ఫుట్‌బాల్ మ్యాచ్ చూసిన నిరంజన్.. ఆయన్ను, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలవాలనుందని తెలిపాడు.నిరంజన్ కోరికను జనసేన నేతలు, పవన్ అభిమానులు ఆయనకు వివరించారు. ఈ విజ్ఞప్తిని మన్నించిన పవన్ కల్యాణ్ రేపు హనుమకొండ వచ్చి నిరంజన్?ను పరామర్శించనున్నారు. ఆంధ్రప్రదేశ్? డిప్యూటీ సీఎంగా ఎన్నికైన తరువాత పవన్ కల్యాణ్ వరంగల్ రావడం ఇదే తొలిసారి.జనసేనాని టూర్ నేపథ్యంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అటు పోలీస్ శాఖ కూడా అప్రమత్తమైంది. పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనుంది.

## పాఠ్య పుస్తకాలు పంపిణీ టీచర్‌ల గైర్హాజరు : డిఈఓ

**టీ మీడియా ,జూన్ 16 ,పెబ్బేరు:**




వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్ పి హెచ్ ఎస్)లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ డీఈవో యాదయ్య విద్యా వ్యవస్థలో క్రమశిక్షణ బాధ్యతల ప్రాధాన్యతను వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన రెండో రోజే జిల్లాలో 99 మంది ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరు కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులే విధులకు హాజరు కాకపోవడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు.చదువు సమాజాన్ని మార్చే శక్తి అలాంటి విద్యను అందించే గురువులు తమ బాధ్యతలను విస్మరిస్తే విద్యార్థుల్లో క్రమశిక్షణ విద్య పట్ల ఆసక్తి దెబ్బతింటుంది ప్రతి ఉపాధ్యాయుడు తన బాధ్యతను గుర్తించి సమయపాలనతో విధులకు హాజరై విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి అని డీఈవో సూచించారు అనంతరం మాట్లాడిన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు ఉపాధ్యాయులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎంఈవో జయరాములు స్థానిక కౌన్సిలర్ లు సౌజన్య దిలీప్ రెడ్డి శివ సాయి మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదినీ రెడ్డి వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లి తండ్రులు పాల్గోన్నారు పాల్గొన్నారు.

## దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలి

● కొమ్ము చెన్నకేశవులు మాదిగ

**టీ మీడియా, జూన్ 16, వనపర్తి బ్యూరో :**



వనపర్తి మున్సిపాలిటీ రాజనగరం 12వ వార్డు చెందిన దళిత కుటుంబాలపై జరుగుతున్న అన్యాయాలు, భూ దౌర్జన్యాలు, వేధింపులను వెంటనే అరికట్టి వారికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు బాధిత దళిత కుటుంబాలు సమావేశంలో వెల్లడించారు.దళితుల జీవనాధారమైన సుమారు 12 ఎకరాల భూమిని తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, అయితే కొంతమంది ప్రభావశీల వ్యక్తులు తమ రాజకీయ, ఆర్థిక పలుకుబడిని ఉపయోగించి ఆ భూములను ఆక్రమించేందుకు కుట్రపూరితంగా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భూములపై తమకు ఎలాంటి హక్కులు లేవని తెలిసినా, దళితుల బలహీనతను ఆసరాగా చేసుకొని భయభ్రాంతులకు గురి చేస్తూ భూములను లాక్కోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దళితులపై జరుగుతున్న ఈ భూదౌర్జన్యం కేవలం భూమి సమస్య మాత్రమే కాదని, ఇది వారి జీవన హక్కు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. భూమి కోల్పోతే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, పిల్లల చదువులు, కుటుంబ పోషణ, ఉపాధి మొత్తం సంక్షోభంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం దళితుల సంక్షేమం, భూహక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు తీసుకు వచ్చినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ దళితులపై భూఆక్రమణలు, వేధింపులు కొనసాగడం బాధాకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గంధం గట్టయ్య మాదిగ, ఎం ఎస్ ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు మొలకలపల్లి పరుషరాముడు మాదిగ,ఎమ్మార్పీఎస్ వనపర్తి మండల అధ్యక్షులు మచ్చ తిరుపతి మాదిగ, అజయ్, వర్మ, రాజానగరం కుల పెద్దలు నాగన్న , కార్తిక్, మహేష్ , మురళి, నాగేష్ శ్రీను చంద్రయ్య బాలయ్య , కురుమూర్తి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ముస్లిం సన్మాన సభ

● హాజరైన అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్

**టీ మీడియా, జూన్ 16, వనపర్తి బ్యూరో :**




హైదరాబాదు రవీంద్ర భారతి లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బీసీ ముస్లిం సన్మాన సభకు వనపర్తి జిల్లా నుండి అతిథిగా హాజరైన అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్. రవీంద్ర భారతిలో జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా మాజీ డిజిపి పూర్ణచందర్ రావు , తొలివెలుగు రఘు, అమిత్ భాషా , మాజీ ఎమ్మెల్సీ సయ్యద్ భాషా , డా" సతీష్ యాదవ్, శ్రీనివాస్ సాగర్ తదితరులు హాజరై ముస్లిం బీసీ కళాకారులు పాడిన పాటలను, ఆటలను, చూసిన తర్వాత ఉమ్మడి జిల్లాలు అయిన ఖమ్మం, మహబూబ్నగర్, వరంగల్, నల్గొండ, ఆదిలాబాద్, మెదక్, హైదరాబాద్ జిల్లాల నుండి వచ్చిన సర్పంచ్ లను ఘనంగా సన్మానించిన నాయకులు.ఈ కార్యక్రమంలో కొన్ని జిల్లాల నుండి వచ్చిన ముస్లిం నాయకులు, బీసీ నాయకులు, సర్పంచులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గ్రామ దేవతలు పట్టణ ప్రజలకు రక్షణ కవచాలు

**టీ మీడియా, జూన్ 16, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని జమ్ములమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా, మృగశిర కార్తీ సందర్భంగా జమ్ములమ్మ దేవతకు మాజీ మంత్రి 23వ వార్డులో జమ్ములమ్మ ఆలయం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గతములో దేవాలయ నిర్మాణాన్నికి 5లక్షల రూపాయలు కేటాయించి అభివృద్ధికి కృషి చేశామని భవిష్యత్తులో ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అభివృద్ధి చేస్తామని అన్నారు.పట్టణ ప్రజలు జమ్ములమ్మ దేవత ఆశీషులతో పాడిపంటలతో సుఖసంతోషాలతో సౌభాగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. నిరంజన్ రెడ్డికి నాయకులు మెకానిక్.శ్రీను,ఉంగ్లం. తిరుమల్ ,నందిమల్ల.శారదా అశోక్ ఘనంగా స్వాగతం పలికి ఆహ్వానించారు. నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ నందిమల్ల.అశోక్ సబ్బిరెడ్డి.యుగంధర్ రెడ్డి, శ్రీనివాస్పూర్.నరసింహ,వీర సాగర్,సూర్యవంశం.గిరి,చిట్యాల.రాము, పెద్దముక్కల. రవి,ఇమ్రాన్,మునికుమార్,చెన్నారెడ్డి, సబ్బిరెడ్డి. రవీందర్ రెడ్డి, ఎంట్ల.శ్రీను, గౌనికాడి. యాదయ్య,తోట.శ్రీను, కుమ్మరి.రామస్వామి తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీ బస్సుల్లో కనిపించని ప్రథమ చికిత్స పెట్టెలు

**టీ మీడియా, జూన్ 16, వనపర్తి బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా రవాణాకు వెన్నెముక లాంటి ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు కేవలం అలంకారంగా మాత్రమే మిగిలిపోయాయి. నిబంధనల ప్రకారం ప్రతి వాహనంలోనూ ప్రథమ చికిత్స కిట్లు ఉండాలనే రూల్ ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అవి ప్రయాణికులకు అందుబాటులో లేవనేది నిజంగానే చేదు నిజం. ఎక్కడో ఒకచోట బాక్స్ కనిపించినా. అందులో మందులు, సర్జికల్ కాటన్ వంటివి శూన్యం. వనపర్తి జిల్లాలో ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితమని అధికారులు చెబుతున్న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సమయంలో చిన్న గాయమైనా ప్రథమ చికిత్స చేసే పరిస్థితులు ఏమాత్రం కనిపించడం లేదు. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఆర్టీసీ, విద్యాసంస్థల బస్సుల్లో ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) పెట్టెలు కచ్చితంగా ఉండాలి.అయితే ఆర్టీసీ బస్సుల్లో చాలా వరకు అవి కనిపించడం లేదు. కొన్ని బస్సుల్లో బాక్సులు ఉన్నా వాటిలో ప్రథమ చికిత్సకు అవసరమైనవి ఉండటం లేదు. దీంతో ప్రయాణికులు గాయపడితే సమీపంలోని ఆసుపత్రికి







వెళ్లే వరకు చికిత్స అందడంలేదు. వనపర్తి జిల్లాలో ఉన్న దాదాపు 120 ఆర్టీసీ బస్సుల్లో నిత్యం సుమారు లక్షల మంది ప్రయాణిస్తుంటారు. లక్షల కిలోమీటర్ల దూరం బస్సులు తిరుగుతాయి. ఈ క్రమంలో జరిగే ప్రమాదాల్లో బస్సులో ఉన్న ప్రయాణికులు గాయా పడుతున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు బస్సుల్లో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్న ప్రయాణికులు పడిపోయే పరిస్థితి. ఇప్పుడు బస్సుల్లో ఉన్న ఆధునిక టెక్నాలజీ కారణంగా ఒక్కసారిగా వాయువేగంతో పరుగులు తీస్తాయి. బస్సులు ఎక్కే సమయంలో, దిగేటప్పుడు పలువురు ప్రయాణికులు పడిపోతున్నారు. బస్సులో ప్రయాణికులు గాయపడితే కండక్టర్ ప్రథమ చికిత్స చేయాలి. ప్రథమచికిత్స గురించి వారికి అవగాహన ఉండాలి. అయితే, ప్రస్తుతం ఆసుపత్రి వెళ్లేవరకు, అంబులెన్సు ఎక్కేవరకు కనీస వైద్యం అందడం లేదు. ప్రయాణికులతోపాటు కండక్టర్లు గాయాలపాలై ప్రథమచికిత్స అందక ఇబ్బంది పడుతున్నారు.గాయాలకు ఎలాస్టిక్, వాటర్‌ప్రూఫ్ ప్లాస్టర్ అందుబాటులో ఉండాలి కానీ పలు ఆర్టీసీ బస్సులను పరిశీలించగా కొన్నింట్లో ఫస్టు ఎయిడ్ బాక్సులే లేవు. కొన్నింట్ ఉన్నా అలంకార ప్రాయంగా మారాయి. ఆ పెట్టెల్లో టిఫ్సో వాడే పేపర్ రోల్స్ పెడుతున్నారు. కొన్నింట్లో స్క్రూ డ్రైవర్ల వంటివి కనిపించాయి. రవాణా శాఖ నిబంధనల ప్రకారం బస్సులలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉండాలి. కానీ ఈ బస్సులలో ప్రథమ చికిత్స పెట్టాలన్న అవగాహన ఆర్టీసీ అధికారులలో ఏమాత్రం కల్పించడం లేదు.ఇదే విషయాన్ని వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ ను వివరణ కోరగా వనపర్తి జిల్లాలో దాదాపుగా 120 బస్సులో నడుస్తున్నాయి. దాదాపు అన్ని బస్సులలో మేము ప్రథమ చికిత్స పెట్టాము. కొన్నింటిలో మాత్రం ఉండకపోవచ్చు. వాటిని కూడా పరిశీలించి త్వరలోనే ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తామని వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్

# "తెలంగాణకు ఊపిరితిత్తులు ఈ రెండు జిల్లాలే"

### ఈ జిల్లాలో అడవుల్లేవ్?!

**టీ మీడియా,జూన్16, హైదరాబాద్ బ్యూరో :**



అడవులతోనే మానవాళికి ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఎన్నో జబ్బులకు ఔషధాలను అటవీ సంపద అందిస్తుంది. అంతేనా? పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటును అందిస్తుంది. వన్యప్రాణులకైతే అడవే ఆధారం. అలాంటిది రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో భారీగా అసమానతలు కనిపిస్తున్నాయి. ములుగు జిల్లా అడుగడుగునా పచ్చదనంతో కళకళలాడుతోంది. కొత్తగూడెంలో భారీ విస్తీర్ణంలో అటవీ ప్రాంతం ఉంది. ప్రస్తుతం ఈ రెండు జిల్లాలే 'తెలంగాణకు ఊపిరితిత్తులు' గా మారాయి. కానీ గద్వాల, కరీంనగర్, హైదరాబాద్? వంటి జిల్లాల్లో మాత్రం పచ్చదనం కోసం వెతుక్కోవాల్సి వస్తుంది.రాష్ట్రం భౌగోళిక విస్తీర్ణంలో అటవీ ప్రాంతం 24.05 ఉందని అటవీశాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన తాజా నివేదికలో తెలిపింది. భూభాగం అటవీ ప్రాంతంలో 71.82 శాతం విస్తీర్ణంలో ములుగు జిల్లా ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 60.95 శాతం అడవులు ఉన్నాయి. నది పరీవాహక ప్రాంతంలో, రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, కుమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నాగర్? కర్నూల్ జిల్లాలు గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోనివే.

ఈ అటవీ ప్రాంతం ఆందోళన కలిగిస్తోంది

హైదరాబాద్ వంటి నగరాల్లో ఆధునిక జీవన విధానం, జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ వల్ల ఎక్కువగా అడవులు క్షీణించిపోతున్నాయి. వాటిని పూర్తిగా లేకుండా చేస్తున్నారు. రాజధాని హైదరాబాద్? భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 0.08 శాతం మాత్రమే అటవీ ప్రాంతంగా ఉంది. కరీంనగర్ పరిస్థితి మరింత ఘోరం. ఇక్కడ అటవీ విస్తీర్ణం 0.15 శాతం అంటే ప్రతి వెయ్యి ఎకరాల భూభాగంలో 1.5 ఎకరం మాత్రం అటవీ ప్రాంతం ఉంది. కరీంనగర్?లో అటవీ ప్రాంతం ఎంతలా దౌర్భాగ్య స్థితిలో ఉందో అంచనా వేసుకోవచ్చు. రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణం 1,12,122 చ.కి.మీ. ఉంది. ఇందులో అటవీ ప్రాంతం 27,688 చ.కి.మీ. ఉంది. అటవీ విస్తీర్ణం అత్యధికంగా ఉన్న జిల్లా భద్రాద్రి కొత్తగూడెం 4,311.38 చ.కి.మీ ఉంటుంది. అత్యల్పంగా ఉన్న జిల్లా హైదరాబాద్? 1.45 చ.కి.మీ. ఉంది.

అడవులు లేకపోవడం వల్ల కలిగే నష్టాలు

అడవులు ప్రతి రాష్టంలో ఉండాల్సినంత విస్తీర్ణంల ఉండాలి. లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కొనవల్సి ఉంటుంది. వర్షపాతం సరిగ్గా ఉండదు. వానలు కురవక, పంటలు పండక ప్రజలు కరవుతో అల్లాడిపోతారు. పశుపక్ష్యాదులకు ఆధారం ఉండదు. భూగర్భజలాలు ఎండిపోతాయి. దీంతో వాతావరణం సమతుల్యతను కోల్పోతుంది. ఎండ తీవ్రత పెరిగిపోతుంది. చల్లదనం బాగా తగ్గిపోతుంది. దీంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. జంతువులన్నీ మనుషులు ఉండే ప్రదేశాలకు వస్తాయి. ప్రజలు భయంకర జంతువులతో భిక్కుభిక్కుమంటూ బతకాల్సి వస్తుంది. అందువల్ల చెట్లని పెంచడం, అడవి సంపదను రక్షించడం ఎంతో అవసరం.

జిల్లాల వారీగా భౌగోళిక విస్తీర్ణం, అటవీ వివరాలు

టాప్? - 5 అటవీ జిల్లాలు ఇవే

(భౌగోళిక, అటవీ విస్తీర్ణం: చ.కి.)

| జిల్లా | భౌగోళిక విస్తీర్ణం | అటవీ విస్తీర్ణం | అటవీ శాతం |
|---|---|---|---|
| ములుగు | 4,092.37 | 2,939.15 | 71.82, |
| కొత్తగూడెం | 7.073.94 | 4,311.38 | 60.95, |
| ఆసిఫాబాద్ | 4,494 | 2,445.40 | 54.41, |
| భూపాలపల్లి | 3,030.27 | 1,562.86 | 51.57, |
| మంచిర్యాల | 3,907.03 | 1,764.72 | 45.17 |

చివరి - 5 జిల్లాలు

| జిల్లా | భౌగోళిక విస్తీర్ణం | అటవీ విస్తీర్ణం | అటవీ శాతం |
|---|---|---|---|
| కరీంనగర్ | 2,125.05 | 3.18 | 0.15, |
| గద్వాల | 2,577.78 | 7.47 | 0.29, |
| హైదరాబాద్? | 181.86 | 1.45 | 0.80, |
| జనగామ | 2,284.79 | 27.83 | 1.22, |
| హనుమకొండ | 1,293.55 | 30.36 | 2.35, |

మిగిలిన జిల్లాల వారీగా ఇలా

| జిల్లా | భౌగోళిక విస్తీర్ణం | అటవీ విస్తీర్ణం | (చ.కి.మీ.) |
|---|---|---|---|
| నాగర్?కర్నూల్? | 6,402.76 | 2,496.68, | |
| ఆదిలాబాద్ | 4,028.58 | 1,724.74, | |
| మహబూబాబాద్? | 3,535.94 | 1397.12, | |
| నిర్మల్? | 3,734.42 | 1,216.61, | |
| కామారెడ్డి | 3,725.62 | 882.82, | |
| నిజామాబాద్? | 4,166.75 | 866.26, | |
| నల్గొండ | 7,225.08 | 650.31, | |
| ఖమ్మం | 4,475,50 | 616.56, | |
| మెదక్? | 2,747.88 | 581.87, | |
| జగిత్యాల | 2,852.61 | 559.32, | |
| వికారాబాద్? | 3,613.71 | 445.42, | |
| రాజన్నసిరిసిల్ల | 1,901.23 | 382.63, | |
| పెద్దపల్లి | 2,212.28 | 338.79, | |
| రంగారెడ్డి | 4,996.93 | 296.11, | |
| మహబూబ్?నగర్ | 2,760.90 | 286.17, | |
| సిద్దిపేట | 3,635.59 | 257.61, | |
| సంగారెడ్డి | 4,459.37 | 209.61, | |
| వరంగల్ | 2,140.07 | 145.7, | |
| సూర్యపేట | 3,585.06 | 125.39, | |
| యాదాద్రి భువనగిరి | 3,253.91 | 118.05, | |
| వనపర్తి | 2,181.97 | 115.85, | |
| మేడ్చల్? మల్కాజిగిరి | 1,084.2 | 83, | |
| నారాయణ పేట | 2,361.15 | 79.12, | |

# ఆధార్‌ను కేవలం గుర్తింపు కార్డుగానే ఉపయోగించాలా?

### కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు

**టీ మీడియా,జూన్16, ఢిల్లీ బ్యూరో :**



యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ జారీ చేసే ఆధార్? కార్డులను పౌరసత్వం, స్థానికత, నివాస చిరునామా రుజువులుగా ఉపయోగిస్తూ దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. మంగళవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందనను కోరింది.చీఫ్? జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహన్?లతో కూడిన ధర్మాసనం, అడ్వకేట్? అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్?పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. అలాగే ఈ పిటిషన్?ను ప్రస్తుతం పెండింగ్?లో ఉన్న ఇలాంటి ఇతర కేసులతో జత చేసింది.

ఇంతకీ ఈ పిటిషన్?లో ఏముంది?

ఆధార్?ను కేవలం గుర్తింపు కార్డుగా ఉపయోగించేలా పరిమితం చేయాలని పిటిషనర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ కోరారు. దీనిని పౌరసత్వం, స్థానికత, చిరునామా, పుట్టిన తేదీకి రుజువుగా వాడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఎన్నికల సంఘానికి కూడా తగిన ఆదేశాలు ఇవ్వాలని సుప్రీం కోర్టును కోరారు. న్యాయవాది అశ్వినీ దూబే ద్వారా ఈ పిటిషన్?ను సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేశారు.కొత్త ఓటరు నమోదు కోసం దరఖాస్తు ఫారమ్?లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా ఆధార్?ను ఉపయోగించడానికి పిటిషనర్? సవాల్ చేశారు. ఇది ఆధార్? చట్టం, 2016లోని సెక్షన్? 9, ప్రజాప్రాతినిధ్య చట్టం (ఆర్?పీఏ)- 1950లోని సెక్షన్? 23(4), రాజ్యాంగంలోని ఆర్టికల్? 14కు విరుద్ధమని పేర్కొన్నారు.

అక్రమ చొరబాటుదారులకు వరంగా మారింది!

"ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 చాలా స్పష్టంగా ఆధార్ అనేది పౌరసత్వం లేదా స్థానికతకు రుజువు కాదు అని చెబుతోంది. అలాగే 2023 ఆగస్టు 22 నాటి యూఐడీఏఐ నోటిఫికేషన్ కూడా ఆధార్? అనేది గుర్తింపునకు మాత్రమే రుజువు, పౌరసత్వం, చిరునామా, పుట్టిన తేదీకి కాదు అని స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ పాఠశాల ప్రవేశాలు, ఆస్తి కొనుగోళ్లు, జనన ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సుల కోసం వయస్సు, పౌరసత్వం, స్థానికత రుజువుగా ఆధార్?ను ఉపయోగిస్తున్నారు. అంతేకాదు కొత్త ఓటరు నమోదు దరఖాస్తు ఫారమ్? (ఫారమ్?-6)లో పుట్టిన తేదీ, నివాస రుజువుగా కూడా వాడుతున్నారు. దీని వల్ల చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్?ను ఉపయోగించి వివిధ రకాల అధికార పత్రాలు పొందుతున్నారు" అని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఫారమ్-6 కింద చేస్తున్న వెరిఫికేషన్ విధానం చాలా లోపభూయిష్టంగా ఉందని, సరైన పత్రాలు లేని వ్యక్తులు కూడా ఓటర్ల డేటాబేస్?లో చేరిపోయే ప్రమాదం ఉందని పిటిషనర్? పేర్కొన్నారు. అందుకే ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించే వెరిఫికేషన్ విధానాన్ని సమూలంగా పునర్వ్యవస్థీకరించాలని ఆయన కోరారు. ఈ సంస్కరణలను పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్? న్యాయమూర్తితో పాటు, సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్? నిపుణులతో కూడిన హై-పవర్? మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విదేశీయులు కూడా ఆధార్ పొందవచ్చు!

ఆధార్? చట్టం ప్రకారం, విదేశీ పౌరులతో సహా దేశంలోని నివాసితులు అందరూ ఆధార్? కార్డు పొందే హక్కు ఉందని పిటిషనర్? అన్నారు. ఓ వ్యక్తి ఒక ఏడాదిలో 182 రోజులు భారతదేశంలో నివసిస్తే, ఆధార్? కార్డు పొందడానికి అర్హత వచ్చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అద్దె ఒప్పందాలు, స్థానిక అధికారుల సిఫారసులు వంటి పత్రాల ఆధారంగా ఎన్?రోల్మెంట్? కేంద్రాల నుంచి ఆధార్ పొందవచ్చని తెలిపారు. అందుకే ఈ లూప్? హోల్స్?ను ఆసరాగా చేసుకొని అక్రమ వలసదారులు, చొరబాటుదారులు ఆధార్?ను సంపాదిస్తున్నారని, ఆ తర్వాత దానిని ఉపయోగించి ఓటరు గుర్తింపు కార్డుతో సహా ఇతర గుర్తింపు పత్రాలను కూడా సులభంగా పొందగలుగుతున్నారని తన పిటిషన్?లో పేర్కొన్నారు.కనుక ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్? 23(4) ప్రకారం, ఆధార్?ను కేవలం గుర్తింపును నిరూపించుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని, వయస్సు, నివాసానికి రుజువుగా వాడకూడదని పిటిషనర్? పేర్కొన్నారు. ఆధార్ ఉపయోగించి దేశంలోకి చొరబడుతున్న అక్రమ వలసదారుల వల్ల ఎన్నికల్లో పారదర్శకత లేకుండా పోతోందని అన్నారు. జనాభా మార్పులు (డెమోగ్రాఫిక్? ఛేంజ్?) వస్తున్నాయని, దేశ భద్రతకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని పిటిషనర్? ఆందోళన వ్యక్తం చేశారు.